

# అత్తగారూ బాల్ పాయింటూ

భానుమతీ రామకృష్ణ

కొందరు ఎంతో మంచి హృదయంతో వారు అభిమానించే వారికి ప్రజంటేషన్స్ యిస్తుంటారు. పుచ్చుకొనేవారూ వారి అభిమానానికీ, ఆప్యాయతకీ పొంగిపోయి నిండు హృదయంతో పుచ్చుకుంటారు.

కాని ఒక్కోసారి కొందరిచ్చే ప్రజంటేషన్స్ ప్రాణాంతకంగా తయారవుతుంటాయి.

ఒకసారి నేనొక కల్చరల్ అసోషియేషన్ వారి యానివర్సరీ ఫంక్షన్‌కి ప్రిసైడ్ చేయాల్సి వచ్చింది. వారంతా నా అభిమానులు. మద్రాసులో వున్న తెలుగువాళ్ళు వచ్చి పిలిస్తే రానని చెప్ప బుద్ధిపుట్టలేదు. జార్జిటౌన్ వైపున్న తెలుగువాళ్ళంతా ఏనాడో మద్రాసులో స్థిరపడ్డవాళ్ళు. వాళ్ళు మాట్లాడే తెలుగు అరవతెలుగు అనాల్సిందే.

అసలు తమిళనాడులో వున్న చాలా మంది తెలుగులకున్న తెగులు ఏమంటే, వారు తెలుగువారమని చెప్పుకోడానికి భయమూ, అవమానమూ, చిన్నతనమూ.

"రండా! మీరుదా నిండా బాగా పాడతారే! ఓ పాట పాడండిమీ!" — యిదీ వారి తెలుగువరస.

"రండా" అనే పిలుపు వినగానే ఏమిటోలా వుంటుంది—వారి ఆప్యాయతకూ భాషకూ సమ్మంధం లేదు. మాతృభాషంటే మళ్ళీ చచ్చేంత అభిమానం.

ఫంక్షన్ అయిపోయింది. వాళ్ళ నాటకాల్లో పాల్గొన్న వాళ్ళందరికీ బహుమతులు పంచడం అయింది. బహుమతులతోబాటు ఆ వ్యాపారస్తుల్లో బాల్ పాయంట్ పెన్నులు తయారుచేసే కంపెనీవారు అక్కడ అందరికీ తలకొక బాల్‌పాయంట్ పెన్ను ప్రజంట్ చేశారు. ఎంతో అభిమానంతో ఆ ప్రెసిడెంటూ, సెక్రెటరీ ఆ బాల్‌పాయంట్ పెన్నులు నాకూ రెండిచ్చారు. 'ఒకటి చాలు, ఒద్దన్నా' వినకుండా మా యింట్లో ఎవరికైనా యివ్వమని యిచ్చారు.

వాళ్ళ అభిమానానికి ఎంతో ఆనందపడిపోతూ తీసుకొన్నాను. ఆ బాల్‌పాయంట్ పెన్నులు చూట్టానికి చాలా అందంగా వున్నాయి. పెన్నుల్లో ఒకటి మా చెల్లెలి కొడుక్కి, ఒకటి మా అత్తగారికీ యిచ్చాను. ఆమె ఎవరికైనా యిచ్చుకోనీమని—"మరి నీకో?" అన్నారామె. నాకు పెన్నుతో వ్రాసే అలవాటే గనక ఒద్దన్నాను.

చూట్టానికి చాలా అందంగా వున్న ఆ పెన్ను ప్రాణప్రదంగా అట్టే పెట్టుకొన్నారు మా అత్తగారు. ఆమె మడిగా పెట్టుకునే తిరుచూర్ణం పెట్టెలో.

ఆ బాల్‌పాయింట్ మా వంటవాడు అడిగాడు. యివ్వనన్నారామె. ఆ మర్నాడే అనుకోకుండా మా అన్న కూతురు పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళి బట్టలు కొనడానికి మా అత్తగారూ, నేనూ, మా ఆడబిడ్డా, వదినే అంతా బయల్దేరాం వాడుగ్గా తీసుకునే బట్టల షాపుకు.

వియ్యాలవారికి పెట్టుడు బట్ట లెన్నెన్ని పెట్టాలో ఎన్ని కొనాలో లిస్టు వ్రాసుకోడానికి నేను నా పెన్ను తీయబోతుంటే టక్కున మా అత్తగారు నేనిచ్చిన బహుమతి బాల్‌పాయింట్ పెన్ను నా కందించారు మందహాసం వెల్లివిరుస్తున్న ముఖంతో....

ప్రశ్నార్ధకంగా చూస్తున్న నాతో "యీ పెన్నుతో వ్రాయవే! చక్కగా కొత్త పెన్ను. శుభమా అంటూ పెళ్ళి బట్టలు కొనబోతున్నాం!" అన్నారు....

ఆమె కిలాంటి విషయాల్లో చాలా పట్టింపులున్నాయి అని నాకు తెలుసు.... సరేనని లిస్టు వ్రాసి ఆ బాల్‌పాయింట్ పెన్నూ బట్టల జాబితా కాగితాలూ ఆమె చేతికిచ్చాను, బట్టలు చూసే హడావిడిలో అటూ యిటూ తిరుగుతూన్న నేను....

మా అత్తగారిచేతి కేదైనా వస్తువిస్తే ఉడుములా పట్టుకుంటారామె.... అంత జాగ్రత!....ఎడంచేతులో లిస్టు కాగితాలూ, బాల్‌పాయింట్ పెన్నూ గట్టిగా పట్టుకుని ఆమెకూడా మాతోబాటు బట్టలు చూస్తూ; ఆమె కాలంలో కొర్నాడు చీరలు ఎట్లా వుండేవో, ఆమె పెళ్లికి వాళ్ళ నాన్నగారు ఎట్లాంటి చీరలు కొన్నారో, వాటి విలువ యీనాడు ఎంత వుంటుందో చెప్తూ పట్టు చీరలదగ్గర నిలబడ్డారు.... నేను మరోవైపు వెళ్ళి మగవాళ్ళ పెళ్ళిబట్టలన్నీ కొని పట్టు చీరలు చూస్తున్న మా అత్తగారివగ్గర కొచ్చాను....

"మంచి పెద్దపెద్ద జల్తారుచీరలు తీయమని చెప్పవే! మా కాలంలో కంచి పట్టు చీరలు మోయలేక పోయేవాళ్ళం. చూడూ. ఎట్లా వున్నాయో యీ పట్టుచీరలు పల్చగా!" అంటూ ముందున్న చీరలు తోశారు నావైపు.



"పెద్దమ్మగారు చెప్పే చీరలు గూడా వున్నాయమ్మా టెంపుల్ శారీస్ అంటారు వాటినే యీ కాలంలో" అంటూ పెద్దపెద్ద సరిగ పట్టుచీరలు అల్‌మారాలోంచి తీసి మా ముందు పడేశాడు.

ఆ చీరలన్నీ తిరగేస్తూ "ఎంత ఒక్కో చీర?" అన్నారు మా అత్తగారు. 'ఆరు వందలు, ఏడువందలూ' అన్నాడు అంగడి వాడు.

"అబ్బో! మా కాలంలో రెండువందలిది ఒక్కోచీర!".... అంటూ మా అత్తగారు ఒక్కొక్క చీర చేతుల్లోకి తీసుకుని బరువు చూసి కింద పడేయడం మొదలెట్టారు....

నాకు చీర్లలో ఎర్ర టెంపుల్ చీర నచ్చింది—తీసి చూడబోతే రెండు నల్లటి సిరామరక లున్నాయి. అదేమాదిరి యింకో చీర తీసిచూస్తే దానిమీదా మరకలున్నాయి... పక్కనున్న చీరలు చూశాను, ఆ చీరలమీదా సిరా మరకలున్నాయి....

కొట్టువాడు ఖంగారు పడుతూ ఆ మరకలు ఎట్లా వచ్చాయా అని తిరగా బోర్లావేసి చూట్టం మొదలెట్టాడు చీరలు....

"భలేవాడివే! ఎవరూ కొనని చీరలు మానెత్తికి అంట గట్టాలని చూస్తున్నావా!" అన్నారు మా అత్తగారు అంగడి వాడివైపు కన్నెర్రజేస్తూ.

"అబ్బే లేదమ్మా! కొత్త పేకెట్ యీ రోజే విప్పాం! యింకా వెలలు గూడా వెయ్యలా!" అన్నాడు ఖంగారుపడుతూ.

"వెలలు మనుషుల్ని చూసి వేస్తార్లే దానికేం గానీ యీ మరకలేమిటంట!' శుభమా అంటూ పెళ్ళికి కొనేవి యిట్లాంటివి కొనమంటావా! మాకు నచ్చిన రెండు చీరల్లోనూ సిరా మరకలున్నాయే! వేరే ఇలాంటివి లేవా?" అన్నారు మా అత్తగారు....అంగడి వాడికి అప్పటికే ముచ్చెమాటలు పోశాయి గాభరాతో.

"యింతేనమ్మా యికలేవు యీ లాంటి చీరలు. యీ పేకెట్టే వచ్చింది యీ రోజు. మిగతావన్నీ అమ్మి పొయినాయి — తీసుకోండి మీకు నచ్చితే ఆ మరక మేం ఎత్తేసి యిస్తాం...."అన్నాడు.

"ఆ! యీ మరకల చీరలు మమ్మల్ని తీసుకో మంటావా! భలే వాడివే! యీ చీరలు నువ్వే వుంచుకొని మాకు మంచివివ్వు!— చూడక పోతే నెత్తిక్కట్టే వాడివేగా!" అంటూ మా అత్తగారు అంగడి వాడిమీద మండి పడ్డారు.

"ఊరుకోండి వాడుగ్గా తీసుకొనే చోటు. ఏమైనా అనుకుంటారని" ఆమెతో రహస్యంగా చెప్పడానికి ఆమె దగ్గరి కొచ్చాను! ఆమె కట్టుకున్న పావురాయి రంగు పట్టు చీర పమిట మీదా అలాంటివే సిరా మరక లున్నాయి చాలా చోట్ల! నాకు చటుక్కున గుర్తొచ్చి. "అత్తా మీ చేయి చూపించండి" అన్నాను. ఆమె ఎడం చెయ్యి విప్పిచూస్తే చెయ్యంతా బాల్‌పాయంట్ పెన్ను సిరా మయం!

నా గుండె గతుక్కుమంది — అన్ని చీరల ఖరీదూ యిమ్మంటారేమో నే! నాకు గాభరాతో ముచ్చెమటలు పోశాయి—అంగడి వాడి ముఖం నల్లబడ్డది....మా అత్తగారు డేంజర్ గ్రహించి! మెల్లిగా "వెళ్ళిపోదాం రావే!" అన్నారు నా చెవి దగ్గరకొచ్చి— నాకు నవ్వొచ్చింది. విషయం టెడిపిందంటే పెద్దవాళ్ళు, పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగిన విధంగా నడుచుకుంటారు.

మా అత్తగారి చేతినీ, మా అత్తగార్నీ అంగడివాడు గుర్రుమని చూట్టం చూశాను. మా అత్తగారు అసలు ఏమీ జరగనట్లే వాడి వైపు చూడకుండా 'బంగారంలాంటి నా చీర పాడయిందే! కొత్తచీర!' అంటూ వాపోవడం మొదలెట్టారు.

నేను అంగడి వాళ్ళ చీరలు అన్నీ పాడయ్యాయే ఏమిటి మార్గం! అనే ఆలోచన్లో పడ్డాను. "వాళ్ళేదో ఆ మరకలు తీసేసు కుంటానన్నారు గా! మనం పోదాం పదవే! ప్రతిదీ సింగినాదంగా బాధపడతావు. పై మడత లోపలికేసి వాళ్ళు అమ్మేసు కుంటార్లే పద!" అన్నారు మా అత్తగారు. నా మనసు ఒప్పుకోలేదు. దోషిలా అంగడి వాడి వైపు చూట్టానికే భయపడుతూ "మీ యజమాన్ని పిలువు" అన్నాను.

తక్షణం పిల్చుకు వచ్చాడు. ఆ సిరా



మరకలయిన చీరలన్నీ నేనే కొంటానని చెప్పాను....

"దానికేమ్మా! తీసుకోండి మీ దగ్గరుంటే ఏం! మా దగ్గరుంటే ఏం" అంటూనే అ చీరలన్నిటినీ మా పేర బిల్లు వ్రాయమని చెప్పాడు. అన్నీ యిప్పించి, "అన్నీ ఒకే రంగులో వున్నాయే యింకేదైనా రంగు తీసుకుంటారా!" అన్నాడు.

"చాలు.... మేమంతా ఒకే రంగులో కట్టాలనుకున్నాం" అని చెప్పాను. దాదాపు రెండు వేల రూపాయల బాల్‌పాయింట్ పెన్ సిరా మరకల చీరలు కొన్నాం. మిగతా కొద్దిగా వియ్యాలవారికి మంచి చీరలు కొన్నాం.

బయటి కొచ్చేప్పుడు మా అత్తగారు ఆ బాల్ పాయింట్ పెన్ను ఎవడో కుర్రాడికి "రాసుకోరా! పెన్ను కొత్తదే! భ్రష్ట ప్పెన్ను. నా చీర పాడుచేసింది చాలక రెండు వేలు వదిలించింది" అంటూ ఆ పెన్ను వాడికిచ్చింది.... నాకు అంత మనసు చీకాకులోనూ పొట్ట చెక్కలయ్యే నవ్వొచ్చింది.... మా అత్తగారు సాధారణంగా బాగావుండేదీ, మంచిదీ ఎవరికీ చూస్తూ చూస్తూ యివ్వరు. చాలాసార్లు మా పక్కింటి అరవ్వాళ్ళకి ఆమె చేసిన చేగోడీలు వారం రోజులయ్యాక పిల్చి యిస్తూ చెప్పేది...."చేశాను! మా పిల్లలు నోట బెట్టలేదు.... మీ పిల్లలకివ్వు!" అని యిచ్చేది....నాకాసమయంలో ఆమె చేగోడీలు గుర్తొచ్చాయి—ఆ పిల్లవాడు ఆశగా తీసుకుని అంగట్లోకి వెళ్ళబోతున్నాడు. నేను ఆ పెన్ను లాక్కుని పక్కనున్న చెత్త బుట్టలో పడేశా.

"అదేమిటే వాడు రాసుకునేవాడుగా!" అన్నారు....

"రాసేదానికంటేముందు లోపల మళ్ళీ కొన్ని గుడ్డలు ఖరాబు చేస్తాడు. వెధవ పెన్ను" అన్నాను ఆ పెన్ను ముట్టుకోడానికే కంపరం కలిగిన నేను...."అవున్లే దరిద్ర ప్పెన్ను ఎంత దండుగ!" అంటూ యింటి కొచ్చినంత దూరం ఆ బాల్ పాయింట్ పెన్నునూ అది ప్రజంటిచ్చిన వాళ్ళనూ తిడుతూనే వున్నారు మా అత్తగారు....

ఇంటికొస్తూనే మా చెల్లెలి కొడుకు వాడి కిచ్చిన బాల్‌పాయింట్ పెన్ను నా ముందు తీసుకొచ్చి పడేసి "చూడమ్మా! వెధవపెన్ను నేను పండక్కి కొనుక్కున్న కొత్త షర్టంతా సిరా చేసింది"—అంటూ షర్టు చూపించాడు.

"రోలొచ్చి మద్దెల్తో మొర పెట్టుకున్నట్లుందిరా నీ గొడవ! నీ బోడిషర్టు పోతే పోయిందిలే! మా గతి చూడు! వేలువేలు బెట్టి సిరామరకల చీరలు కొనుక్కొచ్చాం... అయినా ఆ సన్యాసులు మూతలేని యిట్లాంటి బోడి పాయింట్ పెన్ను లెందుకివ్వాలంట!" అంటూ రుసరుసలాడుతూ వంటింటివేపు వెళ్ళారు మా అత్తగారు....

మా అన్నయ్య కూతురు పెళ్ళికి మేం కొన్న సిరామరకల చీరలు వరసగా అంతా కట్టుకున్నాం.

వియ్యాలవారు మా చీరలూ, వాటిమీద సిరా మరకలూ 'చూసియీ మరకలు అసలు నేతలోనే కొత్త డిజైన్‌గా వేశారా!' అని అడిగారు ఆశ్చర్యపడుతూ....

"అవునండీ! ఇదొక కొత్తరకం డిజైనని చెప్పారు కొట్టువాళ్ళు. అందుకే కొన్నాం" అన్నాను....

అలాగా! అయితే యిలాంటివి మాకూ రెండు తెప్పించి పెట్టండి!—అన్నారు.

"ఇక దొరకవండి! వాళ్ళదగ్గర స్టాకంతా మేమే తీసుకొచ్చేశాం—" అని నేనంటూంటే, మా అత్తగారు వుండలేక ఏదో పనివున్నట్లు లోపలి కెళ్ళి పోయారు.